







బతుకమ్మల్లో మురిపెం

ఒక్కేసి పువ్వేసి.. చందమామ

- ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు



సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ పండుగను ఆడపడుచులు ఘనంగా నిర్వహించారు. మహిళలు తంగేడు, జిల్లేడు, గునుగు, బంతి, ఇలా తీరొక్కపూలతో బతుకమ్మలను పేర్చి ఒక్క చోటుకి చేర్చారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.., ఒక్కేసి పువ్వేసి చందమామా.. అంటూ పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి బతుకమ్మలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఒకరికొకరు ప్రసాదాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ వేడుకలతో జిల్లాలో పూల జాతర నెలకొంది.

- ఘట్‌కేసర్ రూరల్/మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి)



అవుశాపూర్‌లోని రెడ్డి కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అమనగల్లులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

పట్టపగలే మహిళ దారుణ హత్య

పాత కక్షలతో అల్లుడి ఘాతుకం



తాండూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణంలో పట్టపగలే మహిళ దారుణ హత్యకు గురైంది. పాత కక్షలతో అల్లుడే మటన్ కత్తితో తలపై బాది హతమార్చాడు. తాండూరు పట్టణం వాల్మీకి నగర్ ప్రాంతానికి చెందిన పిచ్చకుంట్ల పద్మమ్మ (50)కు భర్త, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. స్థానికంగా పందులను మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం పద్మమ్మ తాండూరు పట్టణం చించిలి రోడ్డు మార్గంలోని మల్లప్ప మడిగే సమీపంలో రోడ్డు పక్కన రోజు మాదిరిగానే పంది మాంసం విక్రయించేందుకు వచ్చింది. మధ్యాహ్నం సమయంలో వరుసకు అల్లుడైన వెంకటేష్ పాత కక్షలను మనస్సులో పెట్టుకుని పద్మమ్మపై కత్తితో తలపై బాదాడు. వెంటనే రక్తపు మడుగులో ఉన్న పద్మమ్మను స్థానికులు ఆటోలో పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



మిల్లు కట్టకున్నా బిల్లు

యాలాల ప్యాక్స్ ఘనత
అప్పనంగా రూ.54లక్షలు
కాంట్రాక్టర్‌కు చెల్లింపు
7



కోట్‌పల్లి ప్రాజెక్టు కుడి కాలువలో షట్టర్ లేని తూములు

సాగునీటి గలగల!

తెరపైకి సాగునీటి సంఘాలు

దశాబ్ద కాలం తర్వాత మళ్లీ సాగునీటి సంఘాలు ఏర్పాటయ్యేందుకు మార్గం సుగమమైంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సంఘాలకు ఎన్నికలు జరగలేదు. కానీ, సంఘాలు ఏర్పాటైతే ఆ శాఖ అధికారులకు పనిభారం తగ్గడమే కాకుండా జలవనరులపై పర్యవేక్షణ మెరుగుపడి సత్వర చర్యలకు అవకాశం ఉండనుంది. గతంలో ప్రాజెక్టులు, చెరువులకు డిస్ట్రిబ్యూటరీల వారీగా నీటి వినియోగదారుల సంఘాలు ఉండేవి. ప్రాజెక్టులు, చెరువులను వారే పర్యవేక్షించేవారు. సంఘాల పరిధిలో ఏమి జరిగినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సత్వర పరిష్కారానికి కృషి చేసేవారు.



కోట్‌పల్లి ప్రాజెక్టు

- ఏర్పాటుకు మార్గం సుగమం
- నీటి వనరులపై పెరగనున్న పర్యవేక్షణ
- ఆయకట్టుకు నీరందించేలా చర్యలకు అవకాశం
- జిల్లాలో ప్రాజెక్టులు 9, చెరువులు 1,187
- ఆయకట్టు 23,927 ఎకరాల విస్తీర్ణం

వికారాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 9 ప్రాజెక్టులు, 1,187 చెరువులు ఉన్నాయి. కోట్‌పల్లి, సర్పన్‌పల్లి, నందివాగు, జుంటుపల్లి, శివసాగర్, అల్లాపూర్, కొంశెట్‌పల్లి, లక్నాపూర్, కక్రవేణి వాగు ప్రాజెక్టులు ఉండగా, వీటిలో కోట్‌పల్లి వాగు ప్రాజెక్టు మాత్రమే మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టులకు 23,927 ఎకరాల ఆయకట్టు ఉండగా, దీంట్లో కోట్‌పల్లి ప్రాజెక్టు కిందనే 9,200 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టులో కనీసం 30 శాతం ఆయకట్టుకు కూడా నీరు అందడం లేదు. దశాబ్దాల తరబడి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి స్థాయి మరమ్మతులకు నోచుకోవడం లేదు. ఇటీవల కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. పేరుకు ప్రాజెక్టులు ఉన్నా ఆయకట్టులో పట్టుమని వంద ఎకరాలకు కూడా సాగునీరు అందించని

మిగతా 8వ పేజీలో...

> ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో సాగునీటి సంఘాల అంశం చర్చకొచ్చింది. గతంలో మాదిరిగానే సాగునీటి సంఘాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు.

తగ్గనున్న పనిభారం

జిల్లాలో ఏటేటా వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పెరిగిన సాగు విస్తీరాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత కాలానికి అనుగుణంగా సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పెరిగిన ఆయకట్టుకు తగిన స్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయింది. ప్రాజెక్టుల్లో నీటి విడుదల సమయంలో చివరి ఆయకట్టు వరకు నీరు అందుతుందా, లేదా అని చూసేవారు కరవయ్యారు. అదే సాగునీటి సంఘాలు ఉంటే చైర్మన్, సభ్యుల పర్యవేక్షణ కొనసాగి ఇబ్బందులు తగ్గనున్నాయి. సాగునీటి సంఘాలు ఉంటే ఒక రకంగా అధికారులకు పనిభారం తగ్గడమే కాకుండా పర్యవేక్షణ మరింత మెరుగయ్యే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

మొదటి విడత వైద్య విద్యార్థుల ఎంపిక

- కొడంగల్ మెడికల్ కళాశాలలో 33 మందికి చాన్స్
- రెండో విడతలో మరో 17 మందికి అవకాశం

తాండూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తాండూరులో తాత్కాలికంగా కొనసాగుతున్న కొడంగల్ మెడికల్ కళాశాలకు కాళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ ద్వారా మొదటి విడత వెబ్ ఆప్షన్ల కింద 26 మంది మెడికల్ విద్యార్థులు అడ్మిషన్‌కు ఎంపికయ్యారు. ఆల్ ఇండియా మెడికల్ కౌన్సిల్ కింద వివిధ రాష్ట్రాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్‌లో ఎంపికయ్యారు. ఇందులో గుజరాత్, హర్యాన రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. ఎంపికైన విద్యార్థులు సోమవారం నుంచి కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చునని కళాశాల ప్రిన్సిపాల్ రాజు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. కొడంగల్ మెడికల్ కళాశాలకు 50 మెడికల్ సీట్లు మంజూరైనందున కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నుంచి రెండో విడత కౌన్సెలింగ్‌లో 17 మంది మెడికల్ విద్యార్థులు ఎంపిక కానున్నారు. కళాశాలలో 50 సీట్లకుగాను 43 సీట్లు మెరిట్ ద్వారా రాష్ట్ర కోటా కింద కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఎంపిక చేసుకునే అకాశం ఉంది. ఆల్ ఇండియా మెడికల్ కౌన్సిల్ కింద ఎంపికైన విద్యార్థులకు అవకాశముంటే వాళ్ల రాష్ట్రాల్లోనూ మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్ చేసుకునేందుకు ఆప్షన్ ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కార్యాలయ తరలింపునకు ఏర్పాట్లు



ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ వెంకటరాజేశ్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అద్దె భవనంలో కొనసాగుతున్న మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండల పరిషత్ భవనంలోకి సాధ్యమైనంత త్వరగా తరలించేందుకు చర్యలు చేపడుతున్నామని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీ వెంకటరాజేశ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సిబ్బంది, కాంగ్రెస్ నాయకులతో కలిసి మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రభుత్వ భవనంలోకి మార్చాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకుపోయారు. మంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్ మేడ్చల్ ఎంపీడీవో కార్యాలయ భవనంలోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు కార్యాలయ తరలింపునలకు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యాలయ తరలింపుపై ఐటీ స్థానిక అధికారులతో సమావేశమయ్యారు. రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వచ్చే వారికి పార్కింగ్, వెయిటింగ్ హాల్‌తోపాటు టాయిలెట్ల ఏర్పాటు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, కాంగ్రెస్ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, స్టాంప్ వెండర్లు పాల్గొన్నారు.



పరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టైఫాయిడ్ బాధితులు

ఫీవర్.. ఫియర్

జిల్లాలో విజృంభిస్తున్న విష జ్వరాలు

- ఆస్పత్రులకు రోగుల పరుగులు
- పెరుగుతున్న టైఫాయిడ్, మలేరియా కేసులు
- ప్రైవేటును ఆశ్రయిస్తే రూ.వేలల్లో వసూలు
- అధికారికంగా పది మందికి డెంగీ

పరిగి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో మార్పులు, ఎడతెరపిలేని వర్షాలతో జనం అనారోగ్యాలపాలవుతున్నారు. జిల్లాలో వైరల్ ఫీవర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. నెల రోజులుగా ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వచ్చేవి. ఎక్కువగా

మిగతా 8వ పేజీలో...

ప్రైవేటుకు పోతే పది వేలవుతోంది



ఇట్లో ఒకరికి జ్వరం వస్తే కుటుంబ సభ్యులందరికి సోకుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన చికిత్స అందుతుందో లేదోనన్న భయంతో ప్రైవేటు దవాఖానకు పోతే పరీక్షలు, మందులు, వైద్యానికి రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. చిన్నపాటి జ్వరం వచ్చినా డాక్టర్లు అన్ని రకాల పరీక్షలు రాస్తున్నారు. ఒక్క పరీక్షలకే మూడు వేలు అవుతుంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి.

- చంద్రయ్య, బాసుపల్లి

రుణమాఫీ అమలు చేయాలి



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

- 1,182 మందికి వర్తింపజేయాలని డిమాండ్

ఘట్‌కేసర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండల రైతులకు తక్షణమే రుణమాఫీని వర్తింపజేయాలని ఆదివారం రైతులు, ఆయా పార్టీల నాయకులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ఒక్క ఘట్‌కేసర్ మండల రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తింపజేయలేదని ఆరోపించారు. దీంతో కొద్ది రోజులుగా రైతులు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలతోపాటు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఘట్‌కేసర్‌లో అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు పొందిన అర్హులైన 1,182 మంది రైతులకు దాదాపు రూ.8 కోట్ల 90 లక్షలు రుణమాఫీ కావాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



తాండూరు సాయిపూర్ రోడ్డుపై వరద నీరు

తాండూరు, ధారూరులో కుండపోత

తాండూరు/ధారూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఆదివారం సాయంత్రం గంటపాటు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం పడింది. మధ్యాహ్నం వరకు ఎండ వేడిమితో ఉన్న వాతావరణం సాయంత్రం వర్షంతో చల్లబడింది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అకాల వర్షంతో చిరు వ్యాపారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే ధారూరు మండల పరిధిలో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘవృతమై ఉరుములు, మెరుపులతో కుండపోత వర్షం కురిసింది. నిర్మలంగా ఉన్న ఆకాశంలో దట్టమైన నల్లని మబ్బులు కమ్ముకుని చీకటిగా మారి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా పలు చోట్ల వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



కోట్‌పల్లి.. సందర్శకుల సందడి

మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ప్రాజెక్టు పరిసరాలను తిలకిస్తూ, ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు. కొంతమంది ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చూస్తూ సరదాగా గడిపారు.

- ధారూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి)

అలైన్మెంట్ మార్చే వరకు రిలే దీక్షలు


దీక్షలో పాల్గొన్న భూ నిర్వాసితులు, చిన్నారులు

కడ్తాల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ పొలాల మీదుగా తలపెట్టిన 765కేవీ విద్యుత్ టవర్ల నిర్మాణ పనులను నిలిపేసి అలైన్‌మెంట్‌ను మార్చాలని కడ్తాలలో భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 14వ రోజుకు చేరాయి. విద్యుత్ టవర్ల నిర్మాణాన్ని ఆపాలని భూ నిర్వాసితులు చేస్తున్న రిలే దీక్షలకు రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. వారు మాట్లాడుతూ.. అనుమతుల్లేకుండా హైటెన్షన్ లైన్ నిర్మించడం సరికాదన్నారు. కొందరు పారిశ్రామికవేత్తల ఒత్తిళ్లతోనే అలైన్మెంట్ మార్చి కడ్తాల మీదుగా వేస్తున్నారని మండిపడ్డారు. టవర్ల ప్రతిపాదిత ప్రాంతాల భూములన్నీ సన్న, చిన్నకారు రైతులవేనని తెలిపారు. తమ భూములను కాపాడుకునేందుకు ఎంతదాకైనా పోరాడతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతుల కుటుంబ సభ్యులు, నాయకులు రామకృష్ణ, సాకేత్, చాణక్య, కె.రాములుగౌడ్, కె.కేశవగౌడ్, సహర్ష్, నిహాన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్‌కు భూములు సేకరిస్తే పేదలకు నష్టం


అయ్యవారిపల్లిలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేద రైతుల భూముల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వేస్తే రైతులు ఉపాధి కోల్పోయి నష్టపోతారని, ముందు నిర్ణయించిన ప్రకారమే ట్రిపుల్‌ఆర్‌ను నిర్మించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎన్.రాజు అన్నారు. ఫరూక్‌నగర్ మండలం అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డ, చించోడు, భీమారం గ్రామాలను ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. పొలాల నుంచి రోడ్డు వేయొద్దని డిమాండ్ చేశారు. గతంలో మార్కింగ్ చేసినట్టే నిర్మించాలని తెలిపారు. గతంలో 472 సర్వే నంబర్ల నుంచి రోడ్డును ప్రతిపాదించారని గుర్తుచేశారు. ఇప్పుడేమో 486 మొదలుకొని 689 వరకు సర్వే నంబర్ల భూముల్లో రోడ్డు వేస్తామని చెప్పడం సరి కాదని అన్నారు. ఇలా రోడ్డు వేస్తే 300మంది రైతులు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు 300 ఎకరాలు కోల్పోతారని తెలిపారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం నిర్మిస్తే నష్టం జరుగుతుందన్నారు. రైతులకు అన్యాయం జరిగితే సీపీఎం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీను, రైతులు సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, చంద్రకాంత్, సాయన్న, సత్తయ్య, శ్రీధర్, యాదయ్య ఉన్నారు.

అభివృద్ధి పేరిట మనోభావాలను దెబ్బతీయొద్దు

కొడంగల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో కొందరి మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం చేయడం సరైంది కాదని ముస్లిం నాయకులన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీనగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, దుకాణాలను తొలగించడంతో పాటు ఓ వర్గానికి చెందిన మతపరమైన నిర్మాణాలను తొలగించడం తగదన్నారు. వారు ఆదివారం కొడంగల్‌లో నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి రోడ్డుకు ఇరువైపులా మతపరమైన నిర్మాణాలను కూల్చడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కానీ ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పలువురు ముస్లిం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కాగా రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి భారీగా మోహరించి బందోబస్తు నిర్వహించారు.


కొడంగల్ చౌరస్తా వద్ద పహరాకాస్తున్న పోలీసులు

హెచ్-1బీ వీసా ఫీజు పెంపుతో భారత విద్యార్థులకు భారం


డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు

చేవెళ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):అమెరికా ప్రభుత్వం హెచ్-1బీ వీసా ఫీజును భారీగా పెంచడం భారత విద్యార్థులకు ఆర్థిక భారం అని బీజేపీ జిల్లా యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడి నిర్ణయం తో ఐటీ నిపుణులు, ఇంజినీర్లు, వైద్యు లు వంటి వృత్తి రంగ నిపుణులు, పైచదువులు చదవాలనుకునే యువత ఆర్థిక భారంతో అమెరికా వెళ్లలేరని అన్నారు. ఉన్నత విద్య, ఉపాధి కోసం అమెరికా వెళ్లలేక వెనకడుగు వేసే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం భారత్-అమెరికా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని చెప్పారు.

వీసా ఫీజు పెంపుతో రాష్ట్రంపై తీవ్ర ప్రభావం


ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): హెచ్1-బీ వీసా ఫీజు రూ.88లక్షలకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో భారతీయుల అమెరికా కలలు చెదురుతాయని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు అన్నారు. వీసా ఫీజు పెంపుతో తెలంగాణ యువతపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఆదివారం ఎంపీ మాట్లాడుతూ.. భారత్-అమెరికాల మధ్య దశాబ్దాలుగా ఉన్న సంబంధాలు ట్రంప్ నిర్ణయంతో దెబ్బతింటాయని, సమస్య పరిష్కారానికి కేంద్రం చొరవచూపాలన్నారు.

ఏనుగు జంగారెడ్డికి గ్లోబల్ శాంతి అవార్డు


అవార్డు అందుకుంటున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి ఆదివారం గ్లోబల్ శాంతి అవార్డు-2025ను అందుకున్నారు. అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ కార్యాలయంలో ఆది వా రం జరిగిన అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర కో-ఆర్డినేటర్లు జి.వేణుగోపాల్, బి.సూర్యలు జంగారెడ్డికి అవార్డును అందజేశారు. వేణుగోపాల్ మాట్లాడుతూ.. దెబ్బడగూడకు చెందిన జంగారెడ్డి విద్యార్థి దశ నుంచే విద్యార్థులు, యువకులను శాంతి మార్గంలో నడిపించి, దేశ సమైక్యత, అభివృద్ధికి పాటుపడ్డారని గుర్తు చేశారు. హింసామార్గంతో ఏమీ సాధించలేమని, కుల మతాలకు అతీతంగా శాంతి యుతంగా మెలగాలని పిలుపునిచ్చారు. నిత్యం శాంతిని బోధించే జంగారెడ్డికి ఈ అవార్డును ఇవ్వడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, సిటిజన్ కౌన్సిల్ ప్రతినిధి శివకుమార్, అందుగుల సత్యనారాయణ, సౌడపు వెంకటేశ్‌గౌడ్, రాఖేశ్‌గౌడ్, బాబూరావు, మహేందర్, నరసిం హ, సురేందర్‌రెడ్డి, బి.రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి


షమీం (ఫైల్)

చౌదరిగూడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో వ్యక్తి మృతిచెందిన ఘటన జిల్లేడు చౌదరిగూడలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు.. పెద్ద ఎల్కిచర్లకు చెందిన షమీం ఆదివారం మధ్యాహ్నం తన పొలం పనులు ముగించుకుని బైకుపై ఇంటికి వస్తున్న సమయంలో అతడిపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో అతడు బైక్‌పై నుంచి పడిపోయాడు. తేనె టీగలను అతడిని శరీరం మొత్తం కుట్టాయి. గమనించిన గ్రామస్తులు వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. వాహనంలో షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే షమీం మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. షమీం నందిగామ మండలంలోని సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్టు తెలిసింది. షమీం భార్య ముజీబున్నీసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అసంపూర్తిగా వంతెన.. ఇబ్బందుల్లో ప్రజలు


నిర్మాణం పూర్తి కాని కాస్లాబాద్ వంతెన

మోమిన్‌పేట్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) మండలంలోని నంది వాగు ప్రాజెక్టు కుడి కాల్వ నుంచి పొలాలకు నీరు వెళ్తుంది. గతంలో కుడి కాల్వపై వంతెన కుంగిపోవడంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడేవి. దీంతో నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. వంతెన నిర్మాణం పూర్తయినా ఇరువైపులా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టక బ్రిడ్జి వాడకంలో లేదు. దీంతో రైతులకు, గ్రామ స్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వంతెన నిర్మించినా ఉపయోగం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా జనరేటర్

● వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోని అధికారులు

బషీరాబాద్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):బషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి పదేళ్ల క్రితం ప్రభుత్వం జనరేటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ జనరేటర్‌కు కనెక్షన్ సకాలంలో ఇవ్వలేదు. దానిలో ఏదో సమస్య తలెత్తిందని టెక్నీషియన్ అప్పట్లో అధికారులకు చెప్పి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి జనరేటర్‌ను ఆన్ చేయించి వాడుకలోకి తెచ్చేందుకు అధికారులు పట్టించుకోలేదు. రూ.లక్షలు వెచ్చించి తెచ్చిన యంత్రం ఎండకు ఎండుతూ వానకు నానుతూ శిథిలావస్థకు చేరుతోంది. కార్యాలయంలో ప్రజలు, అధికారులు, సిబ్బంది సౌకర్యార్థం తెచ్చిన జనరేటర్‌కు కనీసం షెడ్ అయినా వేయించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. తెచ్చినప్పటి నుంచీ ఈ యత్రం నిరుపయోగంగానే ఉంటోంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పుడు కార్యాలయ అధికారులు, సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు మాత్రం తప్పడంలేదు. జనరేటర్‌ను వినియోగంలోకి తెచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.


బషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం బయట పదేళ్లుగా ఉంటున్న జనరేటర్



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బంజారాలు

బంజారాలను ఎస్టీల్లోనే ఉంచాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కొందరు చేస్తున్న కుట్రలు తిప్పి కొట్టేందుకు బంజారా సమాజం ఉద్యమించాలని పలువురు గోర్‌వేల్ఫేర్ అసోసియేషన్ నాయకులన్నారు. ఎస్టీ జాబితాలోంచి తొలగించాలని కొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించడాన్ని నిరసిస్తూ ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎఫ్‌సీ నగర్ నుంచి ఘట్‌కేసర్ అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీని కొనసాగింది. సంఘం నాయకులు మాట్లాడుతూ.. బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే కుట్రలను ఎదుర్కొనేలా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో మోతీలాల్, నరేశ్, కిరణ్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు

సీఎస్ఐ చర్చిలో ఉమెన్స్ ఫెలోషిప్ వేడుక

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని ఎన్జీవో కాలనీ సీఎస్ఐ వెస్లీ చర్చిలో ఆదివారం ఉమెన్స్ ఫెలోషిప్ వేడుకను నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు ప్రార్థనలు నిర్వహించారు. సమాజంలో మహిళల ప్రాధాన్యం గురించి వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీఎస్ఐ మహిళా ఫెలోషిప్ అధ్యక్షురాలు సవిత, మేడ్చల్ చర్చి అధ్యక్షురాలు దేవపాలమ్మ, కార్యదర్శి రజని పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బీటీ రోడ్డు పనులను చేపట్టాలి

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూర్ నుంచి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. మట్టి రోడ్డుపై నుంచి మొరాన్ని తరలిస్తున్న భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం అవుతోందని, ఆదివారం ఆ మార్గంలో వెళ్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. ఇప్పటికైనా బీటీ రోడ్డు పనులకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు.

నిధుల్లేక.. పనులు కాక

విద్యార్థులు, ప్రజల ఇబ్బందులు



నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు

- అసంపూర్తిగా జూనియర్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్, గిరిజన భవన్ పనులు
- దశాబ్దాలుగా కాలేజీ భూ వివాదం
- పరిష్కరించని పాలకులు, అధికారులు

ఆమనగల్లు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచాయి. నిధులు విడుదల కాక కొన్ని, భూ వివాదాలతో మరికొన్ని పనులు కావడం లేదు. అసంపూర్తి భవనాల్లో కొన్ని మూగ జీవాలకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మున్సిపాలిటీలో గతంలో చేపట్టిన కళాశాల భవనం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు, బంజారా భవన్‌ల నిర్మాణాలు మధ్యలో నిలిచాయి. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పనులను పూర్తి చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



భూ వివాదంతో అసంపూర్తిగా నిలిచిన జూనియర్ కళాశాల భవన నిర్మాణం

ఇంటిగ్రేటెడ్ యార్డ్‌కు నిధుల గ్రహణం

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్‌కు 2021లో ప్రభుత్వం రూ.4.5కోట్లు మంజూరు చేసింది. మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మాణానికి స్థలం కేటాయించి శంకుస్థాపన చేశారు. 2023లో పనులు ప్రారంభించి స్లాబ్‌ల వరకు నిర్మించారు. రూ.3.3కోట్ల పనులు చేయగా ప్రభుత్వం రూ.2.26కోట్లు చెల్లించింది. పనులకు రూ.1.04కోట్ల బిల్లు రాక కాంట్రాక్టర్ 20నెలల క్రితం పనులు నిలిపివేశాడు.

భూ వివాదంతో నిలిచిన కాలేజీ నిర్మాణం

ఆమనగల్లుకు 2001లో జూనియర్ కళాశాల మంజూరైంది. భవన నిర్మాణానికి 2004లో అప్పటి ఎమ్మెల్యే దివంగత ఎడ్మ కిష్టారెడ్డి దాతల సహకారంతో మాడ్గుల రోడ్డులో 9.15ఎకరాల కొనుగోలు చేయించి స్థలాన్ని గవర్నర్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పట్లో కాలేజీ నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు కాగా అప్పటి కేంద్ర మంత్రి దివంగత జైపాల్‌రెడ్డి పనులు ప్రారంభించారు. కొద్ది రోజులకే కళాశాల స్థలంపై వివాదాలతో పనులు నిలిచాయి. 2022లో అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కళాశాల స్థల వివాదంపై అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అప్పటి విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి స్థల వివాదాన్ని పరిష్కరించి నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేశారు. దీంతో 2022లో పనులు ప్రారంభమయ్యాయి. భవనాన్ని పూర్తి చేసేలా పనులు జరుగుతుండగా ఆ భూమిపై తమకు హక్కులున్నాయని కొందరు దళితులు కోర్టుకు వెళ్లడంతో 2023లో పనులు నిలిచాయి.

గిరిజన భవన్ పూర్తయ్యేదెన్నడో...

ఆమనగల్లులో తలపెట్టిన గిరిజన(బంజారా) భవన్ నిర్మాణానికి నిధులు లేక మధ్యలో నిలిచింది. 2023లో కల్వకుర్తి రోడ్డులో బంజారా భవనకు 30గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా రూ.2కోట్లు మంజూరు చేశారు. 2023 జూన్ 17న పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాదైనా పనులు ప్రారంభం కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో టెండర్లు నిర్వహించి 8నెలల క్రితం పనులు ప్రారంభించారు. గోడలు, షెడ్డు పనులు పూర్తి చేశారు. రూ.80 లక్షల పనులు చేసినా బిల్లులు రాక 6నెలల క్రితం కాంట్రాక్టర్ పనులను నిలిపేశాడు.



ఏడాదిగా ముందుకుసాగని గిరిజన భవన్ పనులు

నిధులు విడుదల చేయాలి



ఆమనగల్లులో బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. మంజూరు చేసిన పనులకు నిధులు విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం పనులు పూర్తి చేయించి భవనాలను వినియోగంలోకి తేవాలి. ఎమ్మెల్యే, ఎంపీలు చొరవ తీసుకోవాలి. భూ వివాదాన్ని పరిష్కరించి కాలేజీ భవనాన్ని పూర్తి చేయాలి.

\- కండె హరిప్రసాద్, మాజీ జెడ్పీటీసీ, ఆమనగల్లు

ప్రభుత్వానికి నివేదించాం



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం. నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించాం. మంజూరైన రూ.4.5 కోట్లకు అదనంగా మరో రూ.1.49 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. బిల్లుల రాక కాంట్రాక్టర్ పనులు చేయడంలేదు. సమస్య పరిష్కారానికి అధికారులకు వివరిస్తాం.

\- శంకర్‌నాయక్, కమిషనర్, ఏఎంసీ, ఆమనగల్లు

పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం



బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాటంగా పనులను ప్రారంభించింది. చేపట్టిన పనులకు నిధులు విడుదల చేయలేదు. దాంతో చాలా పనులు మధ్యలో నిలిచిపోయాయి. జూనియర్ కళాశాల భవన, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, గిరిజన భవన్ పనుల పూర్తికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి చర్యలు చేపట్టారు. పనులు త్వరలో ప్రారంభించి పూర్తిచేయించి బిల్డింగ్‌లను వినియోగంలోకి తెస్తాం.

\- యాట గీత, ఏఎంసీ చైర్‌పర్సన్, ఆమనగల్లు



ఆగమన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పాల ప్రసాద్‌జీ



ఆగమన్ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా అమ్మవార్ల ఆగమన్

ఆమనగల్లు/చేవెళ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆమనగల్లులోని గాంధీచౌక్ వద్ద ఆదివారం సాయంత్రం దుర్గాభవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత ఆగమన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత సామాజిక, సమరసత ప్రముఖ్ అప్పాల ప్రసాద్, బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారి హాజరై ప్రసగించారు. నవరాత్రి ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. దుర్గమాత శక్తి ధైర్యానికి చిహ్నమని, యువత సంప్రదాయాలను కాపాడుతూ సమాజ సేవల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, నాయకులు సుందూరి శేఖర్, గోరెటి నర్సింహ, విక్రమ్ రెడ్డి, చెక్కాల లక్ష్మణ్, బి.దుర్గయ్య, శ్రీకాంత్ సింగ్, ఉత్సవ కమిటీ సభ్యులు మామిడిశెట్టి ప్రవీణ్, పాతకోట సిరి, బబ్లూ, జె.శివ, మధు, ధ్యాసం వంశీ, జనుంపల్లి నర్సింహ పాల్గొన్నారు. అలాగే చేవెళ్లలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రచ్చబండ దుర్గామాత అమ్మవారి ఆగమన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాత్రి వరకు ఊరేగింపు మధ్య అమ్మవారిని మండపానికి తీసుకువచ్చారు. చేవెళ్లతోపాటు ఆలూర్, మల్కాపూర్, గుండాల, అల్లావాడ, ఎన్కెపల్లి గ్రామాల్లో దుర్గమాతలను నెలకొల్పుతున్నారు.



చేవెళ్లలో దుర్గామాత ఆగమనంలో పాల్గొన్న భక్తులు



ఆమనగల్లులో దుర్గామాత విగ్రహం ప్రతిష్ఠించేందుకు సిద్ధమైన మండపం

శరన్నవరాత్రి ఉత్సవాలకు మండపాలు సిద్ధం

ఆమనగల్లు/చేవెళ్ల సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రోత్సవాలకు ఊరూవాడ ముస్తాబయ్యాయి. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లో సోమవారం నుంచి ప్రారంభమయ్యే దుర్గామాత ఉత్సవాలకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. మండపాలను శోభాయమానంగా రూపుదిద్దారు. దేవీ నవరాత్రోత్సవాలు, దసరా వేడుక నేపథ్యంలో గ్రామాల్లో ఆధ్యాత్మికత నెలకొంది. అక్టోబరు 2వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలు కొనసాగుతాయి.



ప్రత్యేక ఆకర్షణగా రూపుదిద్దుతున్న మండపం

లక్ష్మీవేంకటేశ్వరాలయంలో నిత్య పూజలు ఇలా...

ఈ నెల 23వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త దేవుని వామనాచార్యులు, ఆలయ ఈవో టి.నరేందర్‌లు ఆదివారం మాట్లాడుతూ.. నేటి నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేపట్టే పూజా కార్యక్రమాలను వివరించారు. 22న ఉదయం పంచామృతాభిషేకం, పుణ్యాహవాచనం, దీపారాధన, సహస్ర దీపాలంకరణ, కలిశసేవ, 23న అభిషేకం, వేదపారాయణం, అర్చన, రాత్రి పల్లకి సేవ, 24న అభిషేకం, వేదపారయాణం, రాత్రి చంద్రప్రభ వాహనసేవ, 25న అభిషేకం, వేదపారయణం, రాత్రి రాత్రి 7గంటలకు హంస వాహన సేవ, 26న వేదపారాయణం, సింహవాహన సేవ, 27న అర్చన, రథోత్సవం, 28న అభిషేకం, రాత్రి శేషవాహనసేవ, 29న అభిషేకం, రాత్రి గజవాహన సేవ, 30 అభిషేకం, అర్చన, రాత్రి హనుమంత వాహన సేవ, అక్టోబరు 1న అభిషేకం, అర్చన,రాత్రి గరుడవావన సేవ, 2న అభిషేకం, వేదపారాయణం, అర్చన, విజయదశమి, మధ్యాహ్నం 3గంటలకు పుష్కరిణిలో స్వామి వారి చక్రతీర్థం(తెప్పోత్సవం), రాత్రి 8గంటలకు అశ్వవాహనసేవ, శమీపూజ తదితర కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతాయని తెలిపారు. భక్తులు తరలొచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని సూచించారు.



చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరాలయం

నిత్య కృషితో క్రీడల్లో రాణింపు

» ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్



శంషాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణించడానికి నిరంతరం కృషిచేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సూచించారు. శంషాబాద్ మున్సిపాలిటీలోని ఎస్‌కేఎస్ స్కేటింగ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన మహబూబ్‌నగర్ రోలర్‌స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్‌తో పాటు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు మంచి ప్రతిభ కనబర్చారని కొనియాడారు. ఏ క్రీడల్లోనైనా గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి ఉత్సవాలు

వికారాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రీవారి రజతోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతీ రోజు శ్రీవారి కల్యాణంతోపాటు నిత్యం ఒక వాహనంపై స్వామి వారి ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దైవ దర్శనం చేసుకోవాలని కోరారు.

ఆదివారం అమావాస్య అని మృతదేహం అడ్డగింత

» తండా వాసులకు నచ్చజెప్పిన పోలీసులు

» చివరకు తండాలో మృతదేహం ఖననం

కొత్తూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదివారం అమవాస్య అని మృతదేహాన్ని తీసుకురావొద్దంటూ అడ్డుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని మల్లాపూర్‌తండాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తూర్ మండల పరిధి మల్లాపూర్‌తండా గ్రామపంచాయతీలోని రాగ్యాతండాకు చెందిన విజయలక్ష్మి(33)కి మల్లాపూర్‌తండాకు చెందిన కిషన్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. జీవనోపాధి కోసం వారు శంషాబాద్‌లో నివాసం ఉంటున్నారు. జీవితం మీద విరక్తి చెందిన విజయలక్ష్మి రెండు రోజుల క్రితం క్రిమిసంహారక మందు సేవించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతదేహాన్ని ఖననం చేసేందుకు కుటుంబసభ్యులు మల్లాపూర్‌తండాకు తీసుకువచ్చారు. ఆదివారం అమవాస్య కావడంతో మృతదేహాన్ని తండాకు తీసుకరావద్దని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తన సిబ్బందితో తండాకు చేరుకున్నారు. తండావాసులకు సర్దిచెప్పారు. దీంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు రామాంజపురంలో ఉన్న తమ సొంత భూమికి తరలించి అక్కడ ఖననం చేశారు.

సొంత డబ్బుతో రోడ్డు మరమ్మతులు



రోడ్డుపై మొరం పోసి చదును చేయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చౌడాపూర్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు అధ్వానంగా మారడంతో బీఆర్ఎస్ నాయకులు సొంత డబ్బుతో మరమ్మతు చేయించారు. మండలంలోని జాకారం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులు, ప్రజలు యాతన అనుభవిస్తున్నారు. దీంతో ఆదివారం గ్రామ బీఆర్ఎస్ నాయకులు రోడ్డు గుంతల్లో మొరం పోయించి చదువును చేయించారు. ఇప్పటికైనా మండలంలో రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల నర్సిములు, కృష్ణయ్య, శివకుమార్, చందు, నరసింహ, ప్రవీణ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మిల్లు కట్టకున్నా బిల్లు

యాలాల ప్యాక్స్ ఘనత

» అప్పనంగా రూ.54లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లింపు

» ఏడాదిగా పనులు చేయని గుత్తేదారు

» ఫిర్యాదుకు సిద్ధమైన సొసైటీ



యాలాల పీఏసీఎస్ నిర్మించిన గోదాం

తాండూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు గోదాంలు, రైస్ మిల్లుల నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరు చేసింది. వాటితో సొసైటీలకు గోదాంలు, రైస్ మిల్లులు నిర్మించాలనేది లక్ష్యం. అయితే యాలాల సొసైటీలో కేవలం గోదాంలు నిర్మించారు. రైస్ మిల్లు నిర్మాణానికి ప్యాక్స్ పాలకవర్గం కాంట్రాక్టర్‌కు రూ.54లక్షల అడ్వాన్స్ చెల్లించింది. నాబార్డు అప్పును సొసైటీ కిస్తీల్లో చెల్లించాలి. కాగా మిల్ నిర్మించకుండానే మొదట కిస్తు కింద రూ.32లక్షలు ప్యాక్స్ చెల్లించింది. అయితే మిల్లు కట్టకుండా ఎంబీ రికార్డుకు ఇంజినీరింగ్ అధికారులు అంగీకరించలేదు. తనకు గోదాం కట్టిన బిల్లు రావాల్సి ఉందని కాంట్రాక్టర్ మిల్ నిర్మించకుండా ఏడాదిగా పత్తాలేకుండా పోయాడు. దీంతో సొసైటీ పాలకవర్గంలో టెన్షన్ మొదలైంది. తాము ఎక్కడ ఇరుక్కుంటామేమోనని జంకుతున్నారు.

సొసైటీల్లో వసతుల కల్పనకు నాబార్డు నిధులు

రైతుల సౌకర్యార్థం సొసైటీల్లో గోదాంల నిర్మాణం, రైస్ మిల్లు ఏర్పాటుకు రూ.3కోట్ల చొప్పున నాబార్డు నిధులు మంజూరు చేసింది. తీర్మానాలతో పనులను ఆమోదించి కాంట్రాక్టర్లకు అప్పగించాలి. బషీరాబాద్, యలాల, తట్టెపల్లి, ఎల్మకన్నె సొసైటీలకు గాను బషీరాబాద్‌లో గోదాం, మిల్లు నిర్మించి ప్రారంభించారు. ఎల్మకన్నె, తట్టెపల్లిల్లో గోదాంలు నిర్మించారు. యాలాలలో గోదాం మాత్రం నిర్మించారు. దీనిని ఓ మిల్లర్ ధాన్యాన్ని నిల్వచేసుకునేందుకు ఇచ్చారు. మిల్లు నిర్మించుకుండానే ఏడాది క్రితం కాంట్రాక్టర్‌కు రూ.54లక్షలు చెల్లించారు. ఈ విషయంలో డీసీసీబీ అధికారులు ఎలాంటి విచారణ, పరిశీలన చేయకుండానే అప్రూవల్ ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. కాంట్రాక్టర్‌కు ఆర్థిక లబ్ధి చేకూర్చేలా అడ్వాన్స్ చెల్లించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయమై సొసైటీ సభ్యులు కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. డీసీసీబీ సైతం సదరు కాంట్రాక్టర్‌కు చెందిన కంపెనీకి నోటీసిచ్చింది. అయితే చెల్లింపు చెక్కులపై సొసైటీ చైర్మన్, కార్యదర్శిల సంతకాలున్నాయి. ఇప్పుడు తాము ఇరుక్కున్న సమస్య నుంచి బయటపడేందుకు బాధ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాంట్రాక్టర్ నుంచి డబ్బును రాబట్టేందుకు చూస్తున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం



యాలాల సొసైటీలో గోదాం కట్టి రైస్ మిల్లు నిర్మించలేదు. పనులను వదిలేసిన కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. ఇందుకు కాంట్రాక్టర్‌కు వారం గడువిచ్చాం. అప్పటికీ పనులు చేపట్టకుంటే ఫిర్యాదు చేస్తాం. గోదాం నిర్మాణానికి సొసైటీ తీర్మానించింది. అయితే మిల్లు మిషనరీకి అడ్వాన్స్ చెల్లించాం.

\- సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్, యాలాల

వెంటనే మిల్లు పనులు చేపట్టాలి



గోదాం, రైస్ మిల్ నిర్మాణానికి తీర్మానించి కాంట్రాక్టర్‌కు అడ్వాన్స్ చెల్లించారు. దీనికి సొసైటీ చైర్మన్, సీఈవోలే బాధ్యత వహించాలి. దీనిపై ప్రతీ సమావేశంలో ప్రశ్నించినా సమాధానం చెప్పడం లేదు. మిల్లు మిషనరీకని చెప్పి తీర్మానించి డబ్బు నేరుగా కాంట్రాక్టర్‌కు చెల్లించారు. ఇది నిబంధనలకు విరుద్ధం.

\-రాములు, వైస్ చైర్మన్, యాలాల సొసైటీ

భారీ వర్షం.. పంట నష్టం!

- నీట మునిగిన పంటలు
- కుళ్లిపోతున్న పత్తి, కంది చేన్లు
- బషీరాబాద్‌లో 350ఎకరాల్లో నష్టం
- ఆందోళనలో రైతులు

బషీరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈఏడాది సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదై ఈ ప్రభావం పలు పంటలపై పడింది. వందలాది ఎకరాల్లో పత్తి, కంది, ఇతర పంట పొలాల్లో నీరు చేరి పాడవుతున్నాయి. బషీరాబాద్ మండల వ్యాప్తంగా నల్ల రేగడి భూములు



గొట్టిగఖుర్దు శివారులో నీట మునిగి కుళ్లిపోతున్న పత్తి చేను

అత్యధికంగా ఉన్నాయి. ఈ పొలాలు పత్తి సాగుకు అనుకూలంగా ఉండటంతో ఈ సారి వానాకాలం సీజన్‌లో 14,800 ఎకరాలకు పైగా పత్తి, 12,800 ఎకరాల్లో కంది, 820 ఎకరాల్లో పెసర, 350 ఎకరాల్లో మినుము వంటి ప్రధాన పంటలు సాగుచేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో ఆడపాదడపా కురిసిన వర్షాలకు పత్తి పంటలు ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉన్నాయి. కాగా పత్తికి ఎకరాకు రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టి రైతులు పంటలు సాగు చేస్తున్నారు.

నీట మునిగిన రైతన్న ఆశలు

భారీవర్షాలతో రైతన్నల ఆశలు నీట మునిగిపోయాయి. ఇటీవల నవాంద్గీ, జీవన్గి సమీపంలో కాగ్నానది ఉప్పొంగి ప్రవహించగా, వరద నీరు పత్తి పంట పొలాల్లోకి చేరి చెరువులను తలపించాయి. సుమారు 100ఎకరాల వరకు పత్తి, ఇతర పంటలు నీటమునిగాయి. ఇదిలా ఉండగా పలు గ్రామాల్లో పంట పొలాల్లో రోజుల తరబడి వర్షం నీరు నిలువడంతో పత్తి, కంది పంటలు దెబ్బతిని కుళ్లిపోతున్నాయి. ఈ పరిస్థితి లోతట్టు ప్రాంత పొలాల్లో ఎక్కువగా ఉండటంతో రైతులు నిల్వ నీటిని తొలగించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ ఏడాది వర్షాలకు 350.33 ఎకరాల్లో 60శాతం పైగా వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు



నవాంద్గీ వద్ద కాగ్నానది ఉప్పొంగి పంట పొలాల్లోకి వచ్చిన వరదనీరిలా(ఫైల్)

ప్రాథమికంగా అంచనా వేశారు. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు పాడైన పంట పొలాలను సందర్శించి రైతులను నీరు తొలగించాలని చెబుతున్నారు.

ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి



కాగ్నా నదీ పరివాహక పంట పొలాల రైతులం ఏటా తీవ్రంగా నష్టపోతున్నాం. ఈ ఏడాది వానాకాలంలో ఐదెకరాల్లో పత్తి, కంది సాగు చేశాను. 2ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయి. రోజుల తరబడి నీరు పొలాల్లో నిలువడంతో పంట కుళ్లిపోతోంది. ఇటీవల వ్యవసాయాధికారులు వచ్చి పంట నష్టం అంచనా వేశారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి. - **జి.వెంకట్‌రెడ్డి, రైతు క్యాద్గీరా**

సాగునీటి గలగల!

(ఐదో పేజీ తరువాయి)

దుస్థితి నెలకొందంటే అతిశయోక్తి కాదు. తూములు, సాగునీటి కాలువలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. శిథిలావస్థకు చేరుకున్నా అడిగే నాథుడే కరువయ్యారు. ప్రాజెక్టుల పరిస్థితి ఈ విధంగా ఉంటే చెరువుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. చిన్నపాటి మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు.

మరమ్మతులు చేపడితేనే..

కురిసిన వర్షాలతో జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో భారీగా వరద నీరు చేరుకుని చెరువులు, ప్రాజెక్టులు జలకళతో కళకళలాడుతున్నాయి. జిల్లాలో 1,187 సాగునీటి వనరులు ఉండగా, వాటిలో 354 చెరువులు అలుగెత్తాయి. 729 చెరువుల్లో 75 నుంచి 100 శాతం నీరు చేరుకోగా, 104 చెరువుల్లో 50 నుంచి 75 శాతం మేరకు నీరు చేరింది. జిల్లాలో లక్నాపూర్, సర్పన్‌పల్లి, శివసాగర్, అల్లాపూర్, కొంశెట్‌పల్లి, కక్రవేణి వాగు, కోట్‌పల్లి, జుంటుపల్లి, నందివాగు ప్రాజెక్టులు అలుగెత్తాయి. చెరువుల కింద ఆయకట్టుకు అందాల్సిన నీరు పలు చెరువుల్లో శిథిలావస్థకు చేరుకున్న కాలువలు, తూముల ద్వారా నీరు వృథాగా పోతోంది. వృథాను అరికట్టేందుకు తాత్కాలిక చర్యలు చేపట్టినా అంతగా ప్రయోజనం లేకపోవడం గమనార్హం.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ న్యాయవాది మృతి



బాలయ్య, న్యాయవాది(ఫైల్)

వికారాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ సీనియర్ న్యాయవాది మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొత్తగడి సమీపంలో శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో వికారాబాద్ పట్టణం ఎంఐజీ కాలనీకి చెందిన న్యాయవాది బాలయ్య(59) తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతిచెందాడు. బొప్పునారం గ్రామానికి చెందిన బాలయ్య న్యాయవాది వృత్తిలో ఉంటూ వికారాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయనకు భార్య యశోద, నలుగురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. బాలయ్య మృతితో అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లులు బాలయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం న్యాయవాదులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

మట్టిగుంతలో పడి జీపీ కార్మికుడు..

తాండూరు రూరల్, సెప్టెంబర్ 21, (ఆంధ్రజ్యోతి): మట్టిగుంతలో పడి పంచాయతీ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ఎల్మకన్నె గ్రామంలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ రాథోడ్ వినోద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్మకన్నెకు చెందిన ఎర్రమెట్టి బాలప్ప(38) పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో పనికి వెళ్లలేదు. ఓ వ్యక్తి వచ్చి గ్రామ సమీపంలోని బోనమ్మ ఆలయం వద్ద మట్టితవ్వే పనులు ఉన్నాయని చెప్పి బాలప్పను తీసుకెళ్లాడు. అక్కడ మట్టిని నింపి ట్రాక్టర్‌లలో తరలిస్తుండగా, ప్రమాదవశాత్తు బాలప్ప మట్టి గుంతలో పడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే స్థానికులు తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కారు బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

వికారాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కారు, బైక్ ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్‌లోని డెంటల్ సమీపంలో ఆదివారం ఎదురెదురుగా వస్తున్న కారు, బైక్ ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కొత్రేపల్లి గ్రామానికి చెందిన నరేందర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరికి చెందిన వారిగా గుర్తించారు.

560గ్రాముల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన వ్యక్తితో ఎక్సైజ్ పోలీసులు

వికారాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పొడి గంజాయిని నిల్వచేసిన వ్యక్తిని అరెస్ట్‌చేసి అతడి వద్ద 560గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు వికారాబాద్ ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఆలంపల్లికి చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు అతన్ని సుభాష్‌నగర్‌లో పట్టుకున్నారు. ఇమ్రాన్ వద్ద 560గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అతడిపై కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి



బస్సు డ్రైవర్‌తో మాట్లాడుతున్న పోలీసులు

వికారాబాద్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుకు అడ్డంగా రావడంతో పాటు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై యువకులు దాడిచేసిన ఘటన వికారాబాద్ పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు నుంచి వికారాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సు అనంతగిరి ఆలయం సమీపంలోకి చేరుకుంది. ఈ క్రమంలో అనంతగిరి పర్యాటక కేంద్రానికి వచ్చిన నలుగురు యువకులు మద్యం మత్తులో కారుతో అడ్డంగా రావడంతో పాటు డ్రైవర్‌ను తిట్టి దాడి చేశారు. దీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు నలుగురు యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించగా సత్తయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు

కొడంగల్/కొడంగల్ రూరల్, సెప్టెంబరు 21 ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జాతీయ నూనె విత్తనాల అభివృద్ధి పతకం కింద ఎంపికైన మండలంలోని పెద్దనందిగామ, పర్సాపూర్ గ్రామాల రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందించనున్నట్లు మండల వ్యవసాయధికారి జి.తులసి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దనందిగామ రైతులకు సోమవారం, పర్సాపూర్ గ్రామ రైతులకు మంగళవారం టోకెన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వీసీసీ రైతులకు వేరుశనగ విత్తనాలు 100శాతం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, సంబంధిత సర్వేనంబరు మట్టి నమూనా, ఎఫ్‌పీవో సభ్యత్వ పత్రం తీసుకుని రావాలని కోరారు. సబ్సిడీ విత్తనాలు పొందదలచిన ప్రతీ రైతు తప్పనిసరిగా మట్టినమునా, ఎఫ్‌పీవోలో సభ్యత్వం(రిజిస్ట్రేషన్) చేసుకుని ఉండాలి. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని మెరుగైన విత్తనాలను వాడి నూనెగింజల ఉత్పత్తి పెంచుకోవాలని తెలిపారు.

బీజేపీ కార్యకర్తల శ్రమదానం



పరిగిలోని ప్రశాంతినిలయం వద్ద శ్రమదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

పరిగి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఆదివారం పరిగిలో శ్రీసత్య సాయి ప్రశాంతినిలయంలో, శ్రీనివాసకాలనీ, అనంతరెడ్డినగర్‌లలో శ్రమదానం చేశారు. ఆలయంతో పాటు, పరిసరాల వీధులను శుభ్రం చేశారు. మురికి కాలువల్లోని చెత్తాచెదారాన్ని తొలగించారు. బీజేపీ కార్యకర్తల శ్రమదానంతో కాలనీ పరిశుభ్రంగా మారింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శులు బి.రాంచందర్, రాముయాదవ్, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు బాలకిష్టారెడ్డి, నాయకులు టీవీ నర్సింహులు, వారాల ఆంజనేయులు, కాసుల శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు

కులకచర్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో ఆదివారం హైదరాబాద్ వైద్య బృందం కిడ్నీ సంబంధిత వ్యాధులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతీ ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చంద్రభూపాల్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు షర్ఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్, పెరియార్ సేవలు మరువలేనివి



ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కులవ్యవస్థ నిర్మూలనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పెరియార్ రామస్వామి చేసిన కృషి మరువలేనివని ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రనినిధి మీసాల అరుణ్ కుమార్, బీమ్లా నాయక్ అన్నారు. అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో భాగంగా ఘట్‌కేసర్‌లోని ఎదులాబాద్ రోడ్డులో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో కుల వ్యవస్థ అభివృద్ధికి ఆటంకంగా మారిందరిని అనేక మంది మేధావులు సూచించినట్లు గుర్తుచేశారు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం అంబేడ్కర్ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. అందుకే అంతరాలు లేని నవ సమాజ నిర్మాణం సాధించాలంటే విద్య ఒక్కటే పరిష్కార మార్గమని చెప్పిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దాసు, రాందాస్, నర్సింగరావు, రాంచందర్ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు షురూ



ఘట్‌కేసర్: మున్సిపాలిటీ చందుపట్ల గూడలోని ఓ ఇంట్లో బతుకమ్మను పేరుస్తున్న మహిళలు



మేడ్చల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వికారాబాద్: సిద్దార్థ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



ఘట్‌కేసర్: బొక్కోనిగూడ చౌరస్తాలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో బతుకమ్మ సంబురాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పెత్తరమాస రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ఉత్సవాలను ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోంది. మహిళలు ఉదయం నుంచి రంగు రంగుల పూలను తీసుకొచ్చి బతుకమ్మలు పేర్చి సాయంత్రం సంప్రదాయ దుస్తులను ధరించి ఆడి పాడారు. ఈసారి బతుకమ్మకు పూలు కరువయ్యాయని పలువురు మహిళలు వాపోతున్నారు. ఒకప్పుడు తంగేడు, గునుగు పూవ్వు పుష్కలంగా దొరికేదని కానీ నేడు అన్ని రకాల పూలను మార్కెట్‌లో కొనుక్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు.

ఫీవర్.. ఫియర్

(ఐదో పేజీ తరువాయి)

అతిసారం సోకేది. ప్రస్తుతం అతిసార బాధితుల సంఖ్య తగ్గింది. అదే సంఖ్యలో విషజ్వరాల బాధితులు పెరుగుతున్నారు. జిల్లా ఆస్పత్రి తాండూరు తోపాటు, పరిగి, వికారాబాద్, కొడంగల్, మర్పల్లిల లోని సీహెచ్‌సీలలో కూడా రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతున్నది. జిల్లాలో అధికారికంగా పది మందికి డెంగీ కేసులు నమోదయ్యాయి. టైఫాయిడ్, మలేరియా బాధితుల సంఖ్య వేలల్లో నమోదువుతున్నాయి. నెల రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పట్టణాలు, గ్రామాలు మురికిమయంగా మారాయి. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. చిన్నపిల్లలకు ఎక్కువగా విషజ్వరాలు వస్తున్నాయి. ఐదారునెలల పిల్లలకు కూడా జ్వరాలు ప్రబలి ఆస్పత్రుల పాలవుతున్నారు. కుటుంబంలో ఒకరికి రావడం ఏమోగానీ, కొన్ని గ్రామాల్లో ఇంట్లోని సభ్యులందరూ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇలా ఇంట్లోని వారందరికీ ఖర్చులు తడిసిమోపడవుతున్నాయని బాధితులు వాపోతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీ!

వైరల్ ఫీవర్ బాధితులు చికిత్స కోసం ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. ఆస్పత్రుల నిర్వాహకులు రోగుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. పరీక్షల పేరుతో, మందులకు వేలకువేలు ఖర్చవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్‌లు, మెడికల్‌షాపులు, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు రోగుల నుంచి డబ్బులు పిండుకుంటున్నారు. టైఫాయిడ్ వచ్చిందంటే రూ.6 నుంచి రూ.10 వేల వరకు ఖర్చువుతోందంటే వైద్యం ఖరీదు ఎంత భారీగా పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. పరీక్షల పేరులతో రూ.3 వేల వరకు గుంజుతున్నారని బాధితులు చెబుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌ల దోపిడీని అధికారులు నియంత్రించాలని కోరుతున్నారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



మాములు జ్వరమే కదా అని నిరక్ష్యం చేయొద్దు. వాతావరణంలో మార్పులతో టైఫాయిడ్, మలేరియా రోగుల సంఖ్య పెరిగింది. ప్రతి ఒక్కరూ పారిశుధ్యాన్ని పాటిస్తూ దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేడివేడి పదార్థాలనే తీసుకోవాలి. కాచిచల్లార్చిన నీటిని తీసుకుంటే మంచిది. వైరల్ జ్వరాలకు ప్రత్యేక చికిత్స అంటూ ఏమీ ఉండదు. లక్షణాలను బట్టి చికిత్స చేయించుకోవాలి. టైఫాయిడ్, మలేరియాలకు అంటీబయోటిక్ మందులే అయినా నాలుగైదు రోజుల కోర్సు ఖచ్చితంగా తీసుకోవాలి. ఇక ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతోంది. మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటును ఆశ్రయించి మోసపోద్దు.

- డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో

నేటి కార్యక్రమాలు

ఉచిత శిక్షణ

తాండూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తాండూరు, పరిసర ప్రాంతంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి శ్రీరామకృష్ణ సేవాసమితి, శ్రీనివాస్ రామాంజన్ స్టడి స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత నవోదయ శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నేటి(సోమవారం) నుంచి శిక్షణ తరగతులను బాష్యం జూనియర్ కళాశాలలో సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చి నవోదయ రెసిడెన్షియల్‌స్కూల్, సైనిక్ స్కూల్‌లలో ప్రవేశం పొందేలా చేసి విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 9246358165, 9160380805కు సంప్రదించాలని కోరారు.

మెగా హెల్త్ క్యాంపు

ధారూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగసముందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు(సోమవారం) నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి జ్యోతి తెలిపారు. ఈ క్యాంపులో గైనిక్, ఆర్థో, ఈఎన్‌టీ, ఫిజియోథెరపి, ఈఎన్‌టీ ,సాధారణ రుగ్మతుల పరీక్షలు, చికిత్సలు చేయనున్నట్లు ఆమె చెప్పారు. ప్రజలు వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గీతాపారాయణం

తాండూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రుల సందర్భంగా ఈ నెల 22 నుండి అక్టోబరు 1వ తేదీ వరకు సాయంత్రం 7 గంటలకు తులసీ నగర్‌లో గీతా పారాయణం ఉంటుందని గీతా సత్సంగ్ సేవా సమితి అధ్యక్షులు చల్లా నారాయణ, ప్రధాన కార్యదర్శి దేవగారి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తుల్జభవానీ దేవాలయం రాజు స్వామి ఆధ్వర్యంలో పారాయణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అల్పాహార కార్యక్రమాన్ని కూడ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

యూరియా తిప్పలు



కులకచర్లలో క్యూలో రైతులు

కులకచర్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలోని రెండు ఆగ్రోస్ రైతు సేవాకేంద్రాలకు వచ్చిన యూరియా గంటలోపే అయిపోయింది.మండల కేంద్రంలోని రెండు ఫర్టిలైజర్స్ దుకాణాలకు ఆదివారం 480 బస్తాల యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. యూరియా కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఉత్సవాలకు ముస్తాబైన పోలెపల్లి ఎల్లమ్మ ఆలయం



ఎల్లమ్మ దేవతా మూల విరాట్



ఎల్లమ్మ ఆలయం

దుద్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని పోలెపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. అమ్మవారికి ప్రతీ రోజు కుంకుమ అర్చన, అభిషేకం, యజ్ఞం తదితర పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు ఆలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

కొండాయపల్లిలో దళిత సంఘాల పాదయాత్ర



కొండాయపల్లి నుంచి పాదయాత్ర చేస్తున్న దళిత సంఘాల నాయకులు

దోమ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపల్లి గ్రామంలో ఈనెల 28వ తేదీన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకొని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. కొండాయపల్లి అంబేడ్కర్ విగ్రహం నుంచి దిర్సంపల్లి, పాలెపల్లి, బాసుపల్లి, బొంపల్లి, రాఘవపూర్ మీదుగా పరిగి వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీటీవో రాంచందర్, ఎంఈవో హరిచందర్, దళిత సంఘాల నాయకులు కడుమూరు ఆనందం, అశోక్, మాజీ పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సొసైటీ చైర్మన్ యాదవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, మల్లేశం, రాజిరెడ్డి, రాములు, రామన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రూ.75లక్షలతో సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుద్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆవరణలో రూ.75లక్షలతో సీసీరోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య, జయరాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ అన్నారు. మండలంలోని నందార్‌పూర్ గ్రామానికి చెందిన రమేశ్ భార్య సువర్ణ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లయ్య, సాయప్ప, రాజేందర్‌గౌడ్, శేఖర్, అంజిలప్ప పాల్గొన్నారు.